# సంబంధం కుదిరింది

"వెంకటేశ్వర్లు మళ్ళీ శలవచీటి పంపా డోయ్. కంప్లయింట్స్ బ్రాంచి నువ్వు కాస్త చూడవోయ్" అన్నాడు పోస్టుమాస్టరు ఆర్డరుబుక్కును ముందుకు తోసి

"సరే సర్!" అన్నాడు ఆ పుస్తకంలో సంతకంపెడ్తూ.

"అతనికి ఎంతమంది పిల్లలేమి టోయ్"

"ముగ్గురు ఆడపిల్లలున్నారండి-పెళ్ళి కెదిగినవాళ్లు! మగపిల్లలంతా చిన్నవాళ్లు."

నేను నా బ్రాంచికి వెళ్ళిపోయాను. రెండు వారాలు గడచిపోయాయి వెంకటేశ్వర్లు మళ్ళీ శలవ పెట్టాడు పోస్టుమాస్టరు విసుక్కున్నాడు.

"అవతల ఇనస్పెక్షన్ వస్తున్నది. పి ఎం.జి. నుండి డి వో. లెటర్లు వస్తున్నాయి ఈయనేమో చీటికి మాటికి శలవలు పెట్టేస్తునాడ" అంటూ.

"పాపం ఆడపిల్లల తండ్రి! పెళ్ళి సంబంధాలు చూసుకోవటానికని రాయనే రాసాడు కదండీ! ఈకాలంలో సంబంధం కుదరటమంటే మాటలా! ఎంత తిరగాలి. ఎన్ని అవస్థలు పడాలి" అంటూ సమర్థించాడు డిప్యూటీ- ఇటీవలనే తాను ఒక్కగా నొక్క కూతురు పెళ్ళి సంగతి తలబోస్తూ.

"ఉన్న శలవలూ, డబ్బూ తిరగటంలోనే ఖర్చుపెట్టేస్తే, ఇక పిల్ల పెళ్ళికేం చేస్తాడండీ! అయినా వానాకాలంలో పెళ్లేమిటండీ! నా బొంద."

"పెళ్ళికి వానాకాలం, ఎండాకాలం ఏమిటండీ! ఎప్పుడు కుదిరితే అప్పుడు చెయ్యాలి తిరగ్గానే కుదిరిందటండి! తిరగ్గా, తిరగ్గా మళ్ళీ వానాకాలానికి కుదిరితే అక్కడికి గొప్ప."

ఇట్లా పోస్టుమాస్టరు, డిప్యూటీ మాట్లాడుతుండగానే నేను నా సీటుకు వచ్చేశాను

శిరాంబి రంగనాయకి




"ఏమయ్యా యిట్లా మాట్లాడితే శలవలు పెడ్తే ఎట్లాగయ్యా! అప్పుడు ఇనస్పెక్షనప్పుడూ అంతే! అంతా మేమే చేసుకోవలసి వచ్చింది." అంటున్నాడు పోష్టుమాస్టరు.

"ఈ ఒక్కసారికి కాదనకండి బాబు! ఈ సంబంధం కుదిరేటట్టుంది. తప్పకుండ అయిపోతుంది. మళ్ళీమళ్ళీ శలవు పెట్టవలసిన అవసరము ఉండదు" అంటూ బ్రతిమాలుతున్నాడు వెంకటేశ్వర్లు!

"ఏమోయ్! మళ్ళీ శలవ కావాలంట– ఏం చేస్తాం? ఆ బ్రాంచి కూడ కాస్త చూడు" అన్నాడు పోష్టుమాస్టరు నాతో.

వెంకటేశ్వర్లు వెళ్ళిపోయాడు.

"ఏమోయ్! పోష్టుమాష్టరు చాల ఉదారంగా పనులు పంచిపెడ్తున్నాడు నీకు! మళ్ళీ ఎవరూ చెయ్యలేదంటాడు" అన్నాడు కామేశం బ్రాంచిలో నాతో.

నేనేమీ మాట్లాడలేదు మళ్ళీ కామేశం "ఎందుకు చెయ్యరు? ఓవర్ టైం యిస్తే? తేరగా పని చేయించుకోవాలని చూస్తాడు – ఈయన సొంత సొమ్మంతా పోతున్నట్లు!"

క్లాస్ ఫోర్ అందుకున్నాడు వెంటనే "ఆదా చెయ్యమన్నారు కదండీ ఆదా. అందుకు పి. ఎమ్ జి మెహర్బాణీకోసం పొదుపుచేస్తున్నాడు."

నేను నా పనిలో నిమగ్నమయిపోయా!

* * *

"చూడవయ్యా పదిహేను వందలకి జి.పి.ఎఫ్. లోను పెట్టాడు వెంకటేశం. అసలే జీతంచాలక అప్పులుచేస్తున్నాడు.

ఇదెల్లా తీరుస్తాడయ్యా" అన్నాడు పోస్టు మాష్టరు నాతో.

నేనేం అనక్కర్లేకుండానే డిప్యూటీ అందుకున్నాడు. "లోను పెట్టాడంటే సంబంధం తప్పక కుదిరే వుంటుందండీ! పాపం ఒక పిల్ల పెళ్ళిచేసి కొంత బరువు దించుకుంటున్నాడు."

ఇంతలో వెంకటేశం అక్కడికి వచ్చాడు.

"సంబంధం కుదిరిందటోయ్" అన్నాడు పోస్ట్‌మాష్టరు.

"కట్నమెంత?"

"కట్న మేమీలేదండీ" అంటూ కాగితాలు సంతకాలు పెట్టించుకొని వెళ్ళిపోయాడు వెంకటేశం.

"అదృష్టవంతుడు" అన్నాడు పోష్టు మాస్టరు.

"ఏం అదృష్టం? అతని భార్యేవుంటే ఆ యింటికి నిండుదనం ఉండేది; బొడ్డున రవిక దోపుకొని కన్నెధార పోయవలసిందేగా?" అన్నాడు డిప్యూటీ.

* * *

"పెళ్ళికి శలవ పెట్టాడోయ్. శుభలేఖ తికమకగా ఉన్నట్టుంది! అర్థంకావటము లేదు. అతనేమో వెళ్ళిపోయాడు" అని ఆ శుభలేఖ నా ముందు తోశాడు.

నేను తీసుకోబోయేలోపలే అప్పుడే అక్కడికి వచ్చిన డిప్యూటీ దాన్ని అందుకొని చదివి, నోరుతెరచి కుర్చీలో కూలబడిపోయాడు.

ఆయన అంతలా అవటానికి కారణం తెలియని నేను ఆ శుభలేఖ తీసుకు చదివాను. అందులో యిట్లా ఉంది:

"వరుడు చి॥ వెంకటేశ్వర్లు: వధువు చి॥ సౌ॥ వెంకటలక్ష్మి".

